# కలకాలం

శ్రీ శ్రీ

ఔను, వాహనం మారింది : దూరానికి పూర్వపు టర్థం పోయింది
పూర్వందూరం పోయింది, వెనకటివాహనం మారింది
ఆ సూర్యుడే నేడూ
ఆ చంద్రు డీనాడూ
అవే నక్షత్రాలూ, ఐనా కాలం మారింది

ఔనా, కాలం మారింది మరి: మానవుడా మేలుకో, నేస్తం
ఎద్దుబండితో కొలవకు దూరాన్ని, ఎగరవోయ్ చదలయెద చీలుస్తూ
రేపు బయల్దేరా లనుకున్నావు
నేడే ఇచ్చటికి వచ్చేశావు
విచ్చేసింది నీ తరుణం! పుచ్చుకో ఇది నీ భావి

ఇది నీ భావి గ్రహించు : ఈ భావి నీకు నా ప్రెజెంటు
భూతకాలపు సరీసృపాలని పాతరాతియుగంలో పారెయ్
పాతెయ్ నీ సందేహాలని
తోలెయ్ నీ మందాతూలని
నిటారుగా నిలబడు నేస్తం! హుటాహుటిగా ముందుకి సాగు

హుషారుగా ముందుకి సాగు : ఊరిఖే వెనక్కి చూస్తావేం
దుప్పివీ కుక్కవీకావు, తిర్యగ్దృక్కువి నువ్వు కావు
దూరం కరిగిపోతోంది
కాలం మరిగిపోతోంది
మానవుడిగా మేలుకో నేస్తం, ఏలుకో ఈ విశ్వం సమస్తం